క్లుప్తంగా

గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్సీ ఇక్బాల్



గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మంగళవారం రాత్రి హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు 'సీక్రెట్స్ ఆఫ్ డివైన్ లవ్' పుస్తకాన్ని అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

4న పావగడకు మాజీ సీఎం కుమారస్వామి

పావగడ: మాజీ ముఖ్యమంత్రి, జేడీఎస్ అధినేత కుమారస్వామి ఈ నెల 4 న గురువారం సాయంత్రం పావగడకు రానున్నట్లు స్థానిక జేడీఎస్ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని హిందూపురం రోడ్డు హౌసింగ్ బోర్డు సమీపంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొంటారన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునికి సన్మానం



నాగరాజును సన్మానిస్తున్న ధర్మవరం న్యాయవాదులు

పెనుకొండ: పెనుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజును ధర్మవరం బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు సన్మానించారు. న్యాయవాదులు కృష్ణమోహన్, బాబు, రహంతుల్లా తదితరులు పెనుకొండకు విచ్చేసి నాగరాజును ఘనంగా సత్కరించారు. నాగిరెడ్డి, శర్మ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి భూతప్ప ఉత్సవాలు

అమరాపురం: మండల పరిధిలోని బసవనపల్లిలో వెలసిన మహాలక్ష్మీదేవి, భూతప్పస్వామి ఉత్సవాలను ఈనెల 4 నుంచి 7 వరకు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు. ఈ ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

జాగ్రత్తలతోనే సంపూర్ణ ఆరోగ్యం



రొళ్ల సీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

రొళ్ల: గ్రామాల్లోని ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకొని సంపూర్ణ ఆరోగ్యం పొందేలా అవగాహన కల్పించాలని ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు సీహెచ్‌ఓ ఈశ్వరమ్మ, ఎంపీహెచ్‌ఈఓ షమీవుల్లా సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక సీహెచ్‌సీ ఆస్పత్రిలో ఆరోగ్య, ఆశ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అంగనవాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకొనే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కిరణ్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది, ఆరోగ్య, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోండి

మడకశిరరూరల్: మడకశిర ఉప ఖజానా కార్యాలయం ద్వారా పెన్షన్ పొందుతున్నవారంతా ఈనెల 5వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని తాలుకా పెన్షనర్స్ సంఘం నాయకులు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉప ఖజానా కార్యాలయంలో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

చంద్రబాబుది అధికార దాహం

- ఎమ్మెల్యేలు తిప్పేస్వామి, శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ



గుడిబండ: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



పాలసముద్రం పంచాయతీలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ

గుడిబండ: నవరత్నాల పథకాల అమలుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో గడప గడపలో ఆనందాల హరివిల్లు తీసుకొచ్చారని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కే.ఎస్.పల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూనే ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అందాయా? లేదా? అనే విషయాన్ని లబ్ధిదారులతో ఆరాతీశారు. మూడేళ్లలో ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని తెలిపే బుక్‌లెట్‌ను అందజేసి ప్రజల సమస్యలపై ఆరాతీశారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేశారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి అర్హతే ప్రామాణికంగా వలంటీర్ల ద్వారా కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ టీడీపీ కార్యకర్తలు, నాయకులకు సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం జగన్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఇలాంటి ముఖ్యమంత్రి పాలన చిరకాలం కొనసాగేలా దీవించాలని కోరారు. గ్రామంలో కొంత మంది ఆరోగ్యం బాగాలేక ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కువ ఖర్చులు చేశామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తగిన న్యాయం చేస్తామన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు వేయాలని కోరగా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు, ఆయన అనుచరులు అధికార దాహంతో, మోసపూరిత మాటలతో ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా అందిస్తున్నారన్నారు. గత మూడేళ్ల పాలనలో ఒక్కో కుటుంబానికి అర్హత బట్టి రూ.75 వేల వరకు నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ప్రజలకు దొంగ హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన చంద్రబాబు మరోసారి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్న ఏ ఒక్క పని ప్రజలు గుర్తుండిపోయేలా చేయలేదన్నారు. అందువల్లనే బాబును ప్రజలు తిరస్కరించారన్నారు. కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, ఎంపీడీఓ రామారావు, ఈఓఆర్డీ నాగరాజునాయక్, మార్కెట్ యార్డ్ చైర్మెన్ జయరామ్, సర్పంచ్‌లు యంజారేగౌడు, రంగస్వామి, సింగల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్ ఎస్సీ సెల్ కన్వీనర్ రమేష్, నాయకులు నాగరాజ్‌గుప్తా, పరమేష్ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆదరించండి

గోరంట్ల: పేదల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ పేర్కొన్నారు. మండలంలోని పాలసముద్రం పంచాయతీ పరిధిలోని మిషన్ తండా, కొత్తూరు, పాపన్నపల్లితండా, బెల్లాల చెరువు గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామాల్లో గడప గడపకూ వెళ్లి పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే శంకర నారాయణ మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు 600 పైగా ఆచారణసాధ్యంకాని హామీలు అన్నివర్గాల ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ప్రజా సంకల్పయాత్రలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లారా చూసిన వైఎస్ జగన్ 2019 ఎన్నికల ముందు నవరాత్న పథకాలను తీసుకొచ్చారన్నారు. ఇచ్చిన ప్రతి హామీని పక్కాగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో పేదలకు సంక్షేమ పథకాలు అందలంటే జన్మభూమి కమిటీలకు కప్పం కట్టాల్సిన దుస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికాంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కుల, మత రాజకీయలకు అతీతంగా అన్ని వర్గాల పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందడానికి చంద్రబాబు అండ్ కో కుటిల రాజకీయలకు తెరలేపారన్నారు. వాటిని ప్రజలు తిప్పికొట్టి పేదల అభ్యున్నతి కోసం నిరంతరం పరితపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాంనాయక్, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్‌సాహెబ్, మండల ఉపాధ్యక్షుడు నాగభూషణరెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు బాషా, మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు నూర్‌మహమ్మద్, సర్పంచ్ చిన్న గంగప్ప, స్థానిక నాయకులు, గోవిందరెడ్డి, సామలపల్లి రాము, శ్రీనివాసరెడ్డి, నరసింహమూర్తి, మోతీనాయక్, మండల ముఖ్యనాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత సమాచారం

(గరిష్ఠం)

హిందూపురం	: 34.0
పెనుకొండ	: 35.0
మడకశిర	: 34.0

కాలువపల్లిలో దొంగతనం



బీరువాలోని వస్తువులను చిందర వందర చేసిన దృశ్యం

పరిగి: మండల పరిధిలోని కాలువపల్లి వద్ద ఉన్న ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. లోకేష్ అనే వ్యక్తి అద్దె ఇంట్లో బాడుగకు ఉంటూనే హోటల్ నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో లోకేష్ భార్య అనారోగ్యానికి గురికావడంతో బెంగళూరుకు తీసుకెళ్లాడు. సోమవారం అర్ధరాత్రి సమయంలో దుండగులు ఇంట్లో ప్రవేశించి, బీరువాను పగలగొట్టి బంగారు ఆభరణాలతో పాటు నగదును దోచుకెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. వరుస దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వరుస దొంగతనాలపై పోలీసు ఉన్నతాధికారుల నుంచి పెద్ద ఎత్తున ఆగ్రహావేశాలు వ్యక్తమయినట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై ఎస్ఐ నరేంద్రను వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

సాంకేతిక విద్యతోనే ఉద్యోగాలు



ఉద్యోగ నియామక పత్రాన్ని అందిస్తున్న తహసీల్దార్

మడకశిర: సాంకేతిక విద్యతోనే విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తహసీల్దార్ బాలాంజనేయులు తెలిపారు. మంగళవారం గుండుమల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ కంపెనీలకు ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందించారు. ఏఎస్ఎస్ క్రియేషన్స్ ప్రతినిధి నందీష్, ప్రిన్సిపాల్ శివ కుమారి, శిక్షణ, ప్రాంగణ అధికారి రూపేష్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి



ఉపాధి పనులకు తనిఖీ చేస్తున్న ఏపీడీ

రొద్దం: టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేసి కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ జయసింహ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దగువ్వలపల్లి గ్రామ సమీపంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి పనులను ఏపీడీ తనిఖీ చేశారు. కూలీలు, మస్టర్‌ను పరిశీలించారు. కూలీల సంఖ్య పెంచడానికి ప్రతి గ్రామంలో కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. పెరిగిన కూలీల వేతనాన్ని తెలియజేయాలని వివరించారు. కార్యక్రమంలో సీడీసీ ఎల్ఆర్ లక్ష్మినారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ నరసయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ షమీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆర్టీసీ కండక్టర్ మృతి



సీవీపీ రాజు (ఫైల్)

మడకశిర: మడకశిర ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న సీవీపీ రాజు (56) మంగళవారం మృతి చెందారు. ఆయన గత కొన్ని నెలల నుంచి అనార్యోగంతో బాధపడుతూ పుట్టపర్తిలో మృతి చెందినట్లు ఈయూ డిపో అధ్యక్షుడు రఫిక్ తెలిపారు. మడకశిర డిపో ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది కండక్టర్ రాజు మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వైభవంగా బసవ జయంతి



వీరగాసె కళారూపం అభినయిస్తున్న కళాకారులు

పావగడ: వీరశైవుల ఆరాధ్య దైవమైన బసవేశ్వరస్వామి జయంతి వేడుకలను వైఎన్ హొసకోటలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. వీరశైవ లింగాయత అభివృద్ధి వేదిక, బసవేశ్వర జయంతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వెండి రథంలో బసవేశ్వర స్వామి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. వీరశైవ మహిళలు పూర్ణకుంభ కలశాలను మోశారు. నంది ధ్వజం, వీరగాసె నృత్యం అందరినీ ఆకట్టుకుంది. గ్రామంలోని వీరభద్రస్వామి దేవాలయం నుంచి ఊరేగింపు ప్రారంభమైంది. చుట్టూ పక్కల గ్రామాల వీరశైవులు, లింగాయతలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు రాజేశ్, బీఎస్ మల్లిఖార్జునయ్య, జీటీ మంజునాథ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం



జ్యోతులతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు



అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

రొళ్ల: రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవికి మంగళవారం ఘనంగా జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. అగళి మండలం కోడిపల్లికి చెందిన మహిళలు భక్తిశ్రద్ధలతో బియ్యం పిండితో చేసిన జ్యోతులను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా సమీపంలోని కర్ణాటక ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ నాగేంద్రప్రసాద్ రావు, రాజవంశీకుడు రంగప్పరాజు, సర్పంచ్ చిన్నరంగప్ప తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీలో 'పురం' టాప్



బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పింఛన్ దారుడికి పింఛన్ డబ్బు అందిస్తున్న వలంటీర్ అజయ్



అనంతపురంలో చికిత్స పొందుతున్న నరసింహప్పకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సాయిలత

హిందూపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా లబ్ధిదారులకు అందజేస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీలో హిందూపురం మొదటిస్థానంలో నిలిచింది. మొదటి రెండు రోజుల్లోనే 95 శాతం పూర్తి చేశారు. మొత్తం 13,067 పింఛన్లలో 12,525 మందికి పంపిణీ చేశారు. రెండో స్థానంలో మడకశిర 95.05, ధర్మవరం 95.39, కదిరి మున్సిపాల్టీ 94.95 శాతం పింఛన్లను పంపిణీ చేశారు. అత్యల్పంగా లేపాక్షి పంచాయతీలో 35,38 శాతం, అగళి 39.99 శాతం పంపిణీ జరిగింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,63,587 పింఛన్లు విడుదల కాగా వాటిలో 2,32,846 మందికి పింఛన్లు అందజేశారు.

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లికి చెందిన శీలేపల్లి నరసింహప్ప అనారోగ్యంతో అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మే నెల పింఛన్‌ను ఇవ్వడానికి వలంటీర్ సాయిలత ఇంటికి వెళ్లగా అనంతపురంలో ఉన్నాడన్న విషయం తెలుసుకున్నారు. మంగళవారం ఉదయమే తన సొంత ఖర్చులతో అనంతపురానికి వెళ్లి, నరసింహప్పతో వేలిముద్రలు వేయించుకుని పింఛన్ నగదు రూ.2,750 అందించారు. ఈ సందర్భంగా స్థానికులు సాయిలత సేవలను ప్రశంసించారు.

ఘనంగా సింగిరెడ్డిపల్లి జాతర



గ్రామదేవత దుర్గాదేవికి పూజలు చేస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణ సమీపంలోని సింగిరెడ్డిపల్లిలో చాలా ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న జాతరను రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున నుంచే జ్యోతులతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామదేవతలు దుర్గాదేవి, పులేకమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ అమ్మవార్ల ఆలయాల్లో మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు చేశారు. దుర్గాదేవిని పల్లకీలో కొలువుదీర్చి ఊరేగించారు. సింగిరెడ్డిపల్లి జాతరకు వైఎస్సార్‌సీపీ నాయకులు చౌళూరు మధుమతిరెడ్డి, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి తదితరులు హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో భక్తులు జాతరకు తరలిరావడంతో సింగిరెడ్డిపల్లి కిక్కిరిసిపోయింది.

అభివృద్ధి పనుల పరిశీలన

హిందూపురం: పట్టణంలో అభివృద్ధి పనులు త్వరిత గతిన పూర్తిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. మంగళవారం కొట్నూరు బీసీ కాలనీలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న సి.సి.రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం 21వ వార్డు మోతుకపల్లి , గుడ్డంపల్లి కొత్త డంపింగ్‌యార్డ్‌లను పరిశీలించారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలోని అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు అందజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ కోరారు. ఈ మేరకు ఆయన సబ్ కలెక్టర్ కార్తీక్‌కు మంగళవారం ప్రజలతో కలసి వినతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 8వ వార్డులో ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలం ఉందని, ఆ స్థలంలో అర్హులైన పేదలకు పట్టాలు అందించాలన్నారు. నాయకులు వెంకటరాముడు, తిప్పన్న, గోవింద, ఉత్తప్ప, వెంకటేష్, అశ్విని, రామాంజి, రామాంజినమ్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

రొళ్ల: రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో మంగళవారం హుండీ కానుకలను లెక్కించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ 30 వరకు భక్తులు కానుకల రూపంలో హుండీలో సమర్పించిన నగదు లెక్కించగా రూ.2,63,190 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ ఈఓ నాగేంద్రప్రసాద్ రావు తెలిపారు. ఆదాయాన్ని బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామన్నారు.

బీజేపీ నుంచి జేడీఎస్‌లో చేరిక

పావగడ: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న వేళ చేరికల ప్రక్రియ ఊపందుకుంటోంది. తాజాగా తాలూకాలోని కణివేనహళ్లి గ్రామానికి చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు అశ్వర్థప్ప, సిద్ధరామక్క నేతృత్వంలో సుమారు 80 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం జేడీఎస్‌లో చేరారు. జేడీఎస్ సీనియర్ నేత కన్నేడి లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

జేడీఎస్ నుంచి బీజేపీలో చేరిక

పావగడ: స్థానిక సీనియర్ జేడీఎస్ నాయకులు భీమనకుంటి సత్యనారాయణ చౌదరి, గంగ వరం రామాంజినరెడ్డి, గంగసాగర వెంకటేశప్ప జేడీఎస్‌కు గుడ్ బై చెప్పి మంగళవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతాలు నచ్చి ఆ పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. బీజేపీ జిల్లా కోర్ కమిటీ సభ్యుడు వెంకట్రామయ్య వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నూతన కమిటీ ఎన్నిక

హిందూపురం టౌన్: స్థానిక త్యాగరాజ్‌నగర్‌లోని సీతారామాంనేయస్వామి ఆలయంలో సవిత మహర్షి నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా మూర్తి, కార్యదర్శిగా రాజశేఖర్, జాయింట్ సెక్రటరీగా నాగేంద్రప్రసాద్, ట్రెజరర్‌గా నారాయణప్ప, ఉప ట్రెజరర్‌గా గోపీ, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా శ్రీధర్, రఘు, వెంకటేశులతో పాటు డైరెక్టర్లను ఎన్నుకున్నారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేస్తుందన్నారు.

నేడు సేవా సదన్ మందిరం ప్రారంభం

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున నూతనంగా నిర్మించిన పర్తి సాయి సేవా సదన్ మందిరం నేడు ప్రారంభిస్తున్నట్లు సత్యసాయి సేవాసమితి మండల కన్వీనర్ అంజినరెడ్డి తెలిపారు. ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాటు సిద్ధం చేసినట్లు వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌జే రత్నాకర్, సత్యసాయి సేవా సంస్థల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రునిలక్ష్మణ, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి తదితరులు హాజరు కానున్నట్లు వివరించారు.